# పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలి

**కలెక్టర్ వీపీ గౌతమ్**



సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్

ముదిగొండ, మార్చి 5 : ఇంటర్ పరీక్షల నిర్వహణలో ఎలాంటి అలసత్వం వహించకుండా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. ముదిగొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గదులన్నింటినీ కలిగి తిరుగుతూ మాస్ కాపీయింగ్ జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకున్నారో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రశ్నాపత్రాలు భద్రపరిచే గదిని సందర్శించి.. అకౌంట్ బుక్‌ను పరిశీలించారు. కలెక్టర్ వెంట కళాశాల ప్రిన్సిపాల్ వాసిరెడ్డి శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

# ఇసుక పిరం.. నిర్మాణాలు భారం

**జిల్లాలో కావాల్సినంత ఇసుక ఉన్నా అనుమతులు నిల్**

- ఎక్కడికక్కడ నిలిచిపోతున్న కట్టడాలు.. గగ్గోలు పెడుతున్న బిల్డర్లు
- ఇప్పటివరకు సాండ్ పాలసీని ప్రకటించని రాష్ట్ర ప్రభుత్వం
- కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు ఇసుక విక్రయాలు
- ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న అక్రమార్కులు
- ఇప్పటికైనా సర్కార్ స్పందించాలని సర్వత్రా డిమాండ్



ఖమ్మం, మార్చి 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఇసుక రవాణా, తవ్వకాలపై అనాధికార నిషేధం కొనసాగుతున్నది. దీంతో అక్రమార్కులు కృత్రిమ కొరత సృష్టించి వినియోగదారులకు ఎక్కువ ధరకు ఇసుక విక్రయిస్తున్నారు. కొందరైతే పొరుగు రాష్ట్రమైన ఆంధ్రా నుంచి ఇసుక తెచ్చి బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఇసుక ధరల పెరుగుదల చూసి బిల్డర్లు, తాపీ మేస్త్రీలు, భవన నిర్మాణ రంగ కార్మికులు గగ్గోలు పెడుతున్నారు. నిర్మాణాలు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పక్క రాష్ట్రం నుంచి ఇసుక తరలిస్తుండడంతో రాష్ట్ర ఖజానాకు చేరాల్సిన ఆదాయానికీ గండిపడుతున్నది. ఇంత జరుగుతున్నా మైనింగ్, రెవెన్యూ, పోలీస్ యంత్రాంగానికి చీమ కుట్టినట్లైయినా లేకపోవడం విచారకరం. కేసీఆర్ ప్రభుత్వంలో సరైన ఇసుక పాలసీ అమలు కావడం, బ్లాక్ మార్కెట్‌పై ఉక్కుపాదం మోపడం, అక్రమార్కుల ఆగడాలను కట్టడి చేయడంతో సాఫీగా నిర్మాణ రంగం ముందుకు సాగింది. కానీ ప్రస్తుత పరిస్థితులు అలా లేవు.

### ఆగని ఇసుక రవాణా..

ఖమ్మం జిల్లా ముదిగొండ మండలంలోని పెద్ద మండవ, గంధసిరి, చింతకాని మండలంలోని చిన్న మండవ, ఎర్రుపాలెం, మధిర, బోనకల్ మండలాల్లోని పలు గ్రామాలు, వైరా మండలంలోని కట్టలేరు ప్రాంతంలో ఇసుక అందుబాటులో ఉంది. జిల్లాలో నిర్మాణాలన్నింటికీ ఇక్కడి ఇసుకే ప్రధానం. ఖమ్మం నగరంతో పాటు ఖమ్మం రూరల్ మండలంలో భారీ కట్టడాలు ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్నాయి. వీటి నిర్మాణానికి చింతకాని, ముదిగొండ మండలాల్లో లభించే ఇసుకే ఆధారం. సాధారణంగా రీచ్‌ల నుంచి ఇసుక తరలించాలంటే వ్యాపారులు తహసీల్దార్ కార్యాలయం నుంచి కూపన్లు తీసుకోవాల్సి ఉన్నది. కానీ అక్రమ రవాణాకు అలవాటు పడిన అక్రమార్కులు దొడ్డిదారిన ఇసుక తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. రీచ్‌ల నుంచి ప్రతిరోజూ ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటలలోపే ఇసుక తరలించాల్సి ఉన్నప్పటికీ అక్రమార్కులు 24 గంటల పాటూ ఇసుక తరలిస్తున్నారు. ఆ ఇసుకను ఖమ్మం నగరంలోని బైపాస్ రోడ్డ్ బ్రిడ్జి, రూరల్ మండలం పరిధిలోని కరుణగిరి ఎదురుగా ఉన్న వెంచర్లలో డంప్ చేస్తున్నట్లు తెలుస్తున్నది. కృత్రిమ కొరతను సృష్టించి అక్కడి నుంచి ఎక్కువ ధరలకు వినియోగదారులకు ఇసుక అందిస్తున్నట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా అధికారులు అక్రమ ఇసుక రవాణాపై నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తున్నది.

### ఇసుక పాలసీపై స్పష్టత కరువు..

రాష్ట్ర ప్రభుత్వం ఇసుక పాలసీపై స్పష్టత ఇవ్వడం లేదు. ఇసుక తవ్వకాలపై ప్రభుత్వం ఇప్పటికే ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించాల్సి ఉన్నప్పటికీ ఆ పని జరగలేదు. దీంతో కట్టడాలు నిర్మించాలనుకునే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వ అలసత్వాన్ని అలుసుగా తీసుకుని అక్రమార్కులు బ్లాక్ మార్కెట్‌లో ఇసుక విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో టన్ను ఇసుక రూ.750– రూ.900 మధ్య లభించగా ప్రస్తుతం టన్ను ఇసుక ధర రూ.1,800 నుంచి రూ.2,000 వరకు పలుకుతున్నది. ఒక చిన్న డబుల్ బెడ్‌రూం ఇల్లు నిర్మించాలంటే కనీసం 70 నుంచి 80 టన్నుల ఇసుక అవసరమవుతుంది. ఇంటి నిర్మాణానికి గతంలో ఇంటి యజమానులు ఇసుక కోసం కేవలం రూ.72 వేలు చెల్లించగా ప్రస్తుతం ఆ ధర రూ.1.60 లక్షల వరకు చేరింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇసుక పాలసీని అమలు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### ఇసుక రేటు బాగా పెరిగింది



క్వారీలు లేకపోవడం వల్ల ఇసుక రేటు బాగా పెరిగింది. గతంలో మణుగూరులో నాలుగు క్వారీలు ఉండేవి. ఇప్పుడు ఒక్కటే క్వారీ నడుస్తున్నది. ఇసుక రేటు తగ్గితేనే సామాన్యులు నిర్మాణాలు చేస్తుంటారు. పక్కనే గోదావరి, వాగులు ఉంటే ఇసుక అధిక ధరకు ఎలా కొంటారు. రాత్రుళ్లు లారీలకు లారీలు ఇసుక వెళ్తున్నది. పగలు ఒక ట్రాక్టర్ కూడా బయటకు రాదు. అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టి సామాన్యులకు తక్కువ ధరకు ఇసుక లభించేలా చూడాలి.

**– డి.సత్యనారాయణ, తాపీమేస్త్రీ, మణుగూరు**

### భద్రాద్రి జిల్లాలో ఇదీ పరిస్థితి..



మణుగూరు మండలంలో క్వారీలో నిల్వ ఉన్న ఇసుక

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 5 (నమస్తే తెలంగాణ) : గోదావరి నదీతీరం, ఎక్కడపడితే అక్కడ వాగులు, ఇసుక రీచ్‌లకు కొదవ లేకపోవడంతో జిల్లాలో కావాల్సినంత ఇసుక ఉంది. అయితే అనుమతులు ఇవ్వడంలో ప్రభుత్వ అధికారులు జాప్యం చేస్తుండడంతో ఇసుక రేట్లు బాగా పిరమయ్యాయి. దీంతో భవన నిర్మాణాలు భారమయ్యాయి. గత ప్రభుత్వం అమలుచేసిన 'మన ఇసుక వాహనం' కార్యక్రమం కూడా నత్తనడకన సాగుతుండడంతో ఇసుకకు యమ డిమాండ్ పెరిగింది. దీంతో ఇసుక దందా రోజురోజుకూ పెరిగిపోతున్నది. పక్కనే ఉన్న ఆంధ్రా నుంచి సైతం ఇసుకను తెచ్చి ఇక్కడ అధిక ధరకు అమ్ముతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తుండడంతో ఇసుక వ్యాపారం మూడుపువ్వులు ఆరుకాయలుగా విరాజిల్లుతున్నది. కాంగ్రెస్ సర్కారు వచ్చాక ఇసుక అక్రమ రవాణా మరింత జోరందుకున్నది. లోకల్ ఇసుక వాహనాలు సైతం విచ్చలవిడి అయ్యాయి. రాత్రిళ్లు ఇసుక ట్రాక్టర్లు రయ్‌రయ్ మంటూ పరుగులు పెడుతున్నా అధికారులకు కనిపించడం లేదు.

### భవన నిర్మాణాలకు పెరిగిన భారం

ఇసుక రేటు బాగా పెరిగిపోయే సరికి భవన నిర్మాణాలకు భారం పెరిగింది. గతంలో ట్రాక్టర్ ఇసుక రూ.2వేలు ఉంటే ఇప్పుడు రూ.6వేల వరకు పలుకుతున్నది. ఇసుక లేకుండా నిర్మాణాలు జరగవు కాబట్టి ఇసుక మీరు తెచ్చుకోండి.. మేము గతంలో ఉన్న రేటుకు కట్టిపెడతాం అంటున్నారు కాంట్రాక్టర్లు. దీంతో ఇంటి యజమానులు చేసేదేమీలేక మేస్త్రీలు అడిగిన రేటు ఇచ్చి నిర్మాణాలనుసాగిస్తున్నారు.

### 'మన ఇసుక వాహనం' ఎక్కడ?

సామాన్యులు సైతం ఇంటి నిర్మాణాలు చేసుకునేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 'మన ఇసుక వాహనం' కార్యక్రమాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. వాగుల్లో ర్యాంపులను ఆన్‌లైన్ ద్వారా విక్రయాలు జరిపించే ప్రక్రియ వల్ల తక్కువ రేటుకే ఇసుక ఇంటివద్దకు వచ్చేది. గతంలో జిల్లావ్యాప్తంగా 13 ఇసుక ర్యాంపులు ఉండేవి.. ప్రస్తుతం ఒక్క ర్యాంపును కూడా ప్రారంభించకపోవడంతో మన ఇసుక వాహనాలు అడ్రస్ కనిపించడం లేదు. దీంతో అక్రమార్కులు ఎడ్లబండ్లు, రాత్రుళ్లు తోలే అక్రమ ఇసుక సామాన్యులపై పెనుభారం పడుతున్నది. ఇసుక వాహనం ద్వారా వెయ్యి రూపాయలు ఉంటే అక్రమంగా అధిక ధరలకు విక్రయాలు చేస్తున్నారు. కొత్తగూడెంలో సాటివారిగూడెం, చాతకొండ ర్యాంపులు అనుమతులు వచ్చినా వాటిని ప్రారంభించకపోవడం వల్ల ఇసుక డిమాండ్ విపరీతంగా పెరిగింది. జిల్లాలో ఇసుక రీచ్‌లు కూడా పర్మిషన్లు లేకపోవడంతో మణుగూరులో ఉన్న నాలుగు క్వారీలు మాత్రమే నడుస్తున్నాయి. దీంతో అక్కడ కూడా గోదావరి ఇసుకకు డిమాండ్ పెరిగింది.

### భద్రాచలానికి ఆంధ్రా ఇసుక

పక్కనే గోదావరి ఉన్నా భద్రాచలం పట్టణం నుంచి బూర్గంపాడు మండలాల వరకు ఆంధ్రా ఇసుక దందా కొనసాగుతున్నది. విపరీతమైన ధరలకు విక్రయాలు చేస్తున్నారు. ఇటీవల ఆంధ్రాలో గుండాల ఇసుక రీచ్ కొన్నిరోజులు బంద్ చేసి మళ్లీ యథావిధిగా కొనసాగిస్తుండడంతో భద్రాచలంలో అక్రమ రవాణా మరింత పెరిగింది.

# కడవరకూ బీఆర్ఎస్‌తోనే పయనం

**భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు**



మాట్లాడుతున్న భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

భద్రాచలం, మార్చి 5: ' నేను బీఆర్ఎస్‌ను వీడుతున్నట్లు అనవసర ప్రచారం జరుగుతున్నది. ఆ ప్రచారంలో ఎలాంటి నిజం లేదు. నేను కడవరకు బీఆర్ఎస్‌లోనే కొనసాగుతాను' అని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు స్పష్టం చేశారు. భద్రాచలంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలు తనపై ఎంతో నమ్మకం ఉంచి ఎన్నికల్లో గెలిపించారన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలోకి తీసుకొస్తానని విశ్వసించారన్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేసి వ్యక్తిత్వం తనది కాదన్నారు. గతంలో నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించిన ఎమ్మెల్యేలు అభివృద్ధి గురించి పట్టించుకోలేదని, ఇక్కడ ప్రజలకు ఎలాంటి మేలు చేయలేదని మండిపడ్డారు. నాటి ప్రభుత్వాలతో వారు సత్సంబంధాలు నెరపలేకపోయారని, నిధులు రాబట్టలేకపోయారని గుర్తుచేశారు. గతంలో జరిగిన తప్పులను తాను పునరావృతం చేయనని ప్రకటించారు. తాను కేవలం నియోజకవర్గ అభివృద్ధి కోసమే ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశానని స్పష్టం చేశారు. నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు మున్ముందు మంత్రులనూ కలుస్తానని, ఆ విషయంలో వెనుకంజ వేయనన్నారు. ఈ నెల 11న సీఎం రేవంత్‌రెడ్డి భద్రాచలంలో పర్యటించనున్న నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులు ప్రజాసమస్యలను గుర్తించి, సీఎంకు నివేదించాలని సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్ భద్రాచలం మండల అధ్యక్ష, కార్యదర్శులు అరికెళ్ల తిరుపతిరావు, కొండిశెట్టి కృష్ణమూర్తి, నాయకులు సత్యనారాయణమూర్తి, రత్నం రమాకాంత్, చింతాడి చిట్టిబాబు, నర్రా రాము, బొంబోతుల రాజీవ్, గాడి విజయ్, చుక్కా సుధాకర్, మామిడి పుల్లారావు, పెద్దినేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయండి

**తాగునీటి ఎద్దడి నివారణపై అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష**



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

మామిళ్లగూడెం, మార్చి 5 : తాగునీటి ఎద్దడిని నివారించేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, జౌళి, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ వీపీ గౌతమ్‌తో కలిసి జిల్లాలో నీటి ఎద్దడి నివారణకు చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై రెవెన్యూ, ఇరిగేషన్, పబ్లిక్ హెల్త్, మిషన్ భగీరథ, పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలోని పాలేరు, వైరా, లకారం, లంకపల్లి జలాశయాల్లో నీటి లభ్యత, వచ్చే నాలుగు నెలలకు కావాల్సిన అవసరాలపై ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. బేతుపల్లి, బోడేపూడి సుజలాం సఫలం, భగీరథ ఎన్ఎస్పీ ద్వారా నీటిని సమకూర్చుకుంటే భూగర్భ జలాలు పెరగడంతోపాటు బోర్లు, బావుల్లో గ్రావిటీ పెరుగుతుందని, దీంతో నీటి కొరతను అధిగమించవచ్చన్నారు. కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ మంత్రి సూచన ప్రకారం నీటి ఎద్దడి నివారణకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, తాగునీటి లభ్యత, వినియోగంపై సమీక్షా సమావేశాలు నిర్వహించి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జలాశయాలతో పాటు గ్రామాల్లో ఉన్న బోర్లను పునరుద్ధరించామన్నారు. సమావేశంలో సీపీ సునీల్ దత్, అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, శిక్షణ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ సురేందర్, ఇరిగేషన్ ఎస్ఈ ఆనంద్‌కుమార్, మిషన్ భగీరథ ఎస్ఈ సదాశివకుమార్, భగీరథ ఇంట్రా ఈఈ పుష్పలత, గ్రిడ్ ఈఈ వాణిశ్రీ, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్‌కుమార్, మున్సిపల్ ఈఈ కృష్ణలాల్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

**అధికారులను ఆదేశించిన కలెక్టర్ ప్రియాంక ఆల**



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాక. పక్కన ఎస్పీ రోహిత్ రాజు

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 5 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఈ నెల 11న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించనున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రియాంక ఆల అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీవోసీలోని సమావేశ మందిరంలో ఎస్పీ రోహిత్ రాజు, ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్‌లతో కలిసి అన్ని శాఖల జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రామాలయ దర్శనం తర్వాత జిల్లాలోని అభివృద్ధి పనులపై గిరిజన భవన్‌లో రివ్యూ మీటింగ్ నిర్వహించనున్నందున ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. లక్ష్మీపురం సమీపంలో ఎంపిక చేసిన సభాస్థలంలో పూర్తిస్థాయి ఏర్పాట్లు చేపట్టాలన్నారు. సభకు వచ్చే ప్రజలకు తాగునీరు ఏర్పాటు చేయాలని, హెల్త్ క్యాంపు ఏర్పాటు చేయాలని, అగ్నిమాపక దళం సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం జిల్లాలో జరిగే అన్ని అభివృద్ధి పనుల పురోగతిపై ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీవో విద్యాచందన, డీఆర్వో రవీంద్రనాథ్, కలెక్టరేట్ ఏవో గన్యా, డీఎంహెచ్‌వో శిరీష, డీఎస్‌వో రుక్మిణి, భద్రాచలం ఆర్డీవో దామోదర్‌రావు, కొత్తగూడెం ఆర్డీవో మధు, ఆర్అండ్‌బీ ఈఈ అర్జున్, పీఆర్ ఈఈ శ్రీనివాస్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్య, ఇరిగేషన్ ఎస్సీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# విత్తన దుకాణం ఎదుట రైతుల ధర్నా

**నకిలీ విత్తనాలు అంటగట్టారని పురుగుమందు డబ్బాలతో బైఠాయింపు**



ములకలపల్లిలోని విత్తనాల దుకాణం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

ములకలపల్లి, మార్చి 5 : నకిలీ విత్తనాలతో నష్టపోయిన తమకు న్యాయం చేయాలని కోరుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం తాళ్లపాయకు చెందిన గిరిజన రైతులు మంగళవారం ములకలపల్లిలోని బాలాజీ ఫెర్టిలైజర్స్ ఎదుట పురుగు మందు డబ్బాలతో బైఠాయించి ఆందోళన నిర్వహించారు. 20 మంది రైతులు 40 ఎకరాల్లో యాసంగి వరి సాగు కోసం బాలాజీ ఫెర్టిలైజర్స్‌లో నాగార్జున సీడ్స్ వారి హెచ్ఎంటీ సోనా, ఆర్ఎన్ఆర్ వరి విత్తనాలు కొనుగోలు చేశారు. వీటిని సాగు కోసం వినియోగించగా.. వయసు రాకముందే ఈనిన పొలం అంతా తాలు కంకులు వేసింది. దీంతో నష్టపోయిన రైతులు తమకు న్యాయం చేయాలని కోరుతూ పురుగు మందు డబ్బాలతో దుకాణం ఎదుట ఆందోళన నిర్వహించారు. పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయకపోతే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటామని రైతులు పేర్కొన్నారు. కాగా.. పది రోజుల క్రితం బాధిత రైతులు స్థానిక ఎమ్మెల్యేను కలిసి తమ గోడు విన్నవించుకున్నా.. నష్టపోయిన పంటలను, రైతులను కన్నెత్తి చూడకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి బాధిత రైతులకు న్యాయం చేయాలని రైతులు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.


దంత వైద్యుల దినోత్సవ శుభాకాంక్షలు..

సునీల్ దంత వైద్యశాల

డా॥ R.సునీల్, MDS

PROSTHODONTIST & IMPLANTOLOGIST

పాల్వంచ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

9440830067, 9966355558


# బౌద్ధ స్థూపం ప్రాధాన్యతను ప్రపంచం దృష్టికి తీసుకెళ్తాం..

**పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చేస్తాం..**

**రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



ముజ్జుగూడెం సమీపంలోని బౌద్ధ స్థూపాన్ని పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి(నేలకొండపల్లి), మార్చి 5 : ఎంతో చరిత్ర కలిగిన బౌద్ధ స్థూపం ప్రాధాన్యతను ప్రపంచం దృష్టికి తీసుకెళ్లేందుకు అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి, పాలేరు ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలో మంగళవారం పర్యటించిన ఆయన ముజ్జుగూడెం సమీపంలోని బౌద్ధ స్థూపాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బౌద్ధుల పరిపాలన, వారి చారిత్రక ఘట్టానికి ఆనవాళ్లుగా మిగిలిన ఈ స్థూపం కాలక్రమంలో మరుగునపడిందన్నారు. బౌద్ధులకు నిలయంగా పాలన సాగిన కాలంలో నేలకొండపల్లికి ఎంతో గొప్ప చరిత్ర ఉందని, ఆ చరిత్రను భావితరాలు గుర్తుంచుకోవాలనే ఉద్దేశంతో 8 ఎకరాల స్థలంలో చుట్టూరా అభివృద్ధి చేసేందుకు తగిన కార్యచరణ రూపొందించాలన్నారు. స్థూపం చుట్టూ, పరిసరాలను శుభ్రం చేయాలని, బస్టాండ్లు, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో స్థూపానికి సంబంధించి వివరాలు తెలుపుతూ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రూ.కోటి వ్యయంతో నిర్మిస్తున్న విడిది కేంద్రాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. భక్తరామదాసు నడయాడిన స్థలం కూడా ఇక్కడే ఉండడంతో ఈ ప్రాంతం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నదన్నారు. ఇప్పటివరకు బౌద్ధ స్థూపం వద్ద చేపట్టిన పనులు, వాటి వివరాలను కలెక్టర్ గౌతమ్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పురావస్తు శాఖ ఏడీ నర్సింగ్‌నాయక్, టూరిజం అధికారి సుమన్ చక్రవర్తి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఆర్డీవో నగేశ్, స్పెషల్ ఆఫీసర్ శ్రీరాం, ఎంపీపీ వజ్జా రమ్య, కాంగ్రెస్ నాయకులు రాయల నాగేశ్వరరావు, స్వర్ణకుమారి, వెన్నెపూసల సీతారాములు, శాఖమూరి రమేశ్, నెల్లూరి భద్రయ్య, నాగేశ్వరరావు, చెరువు స్వర్ణ, బొందయ్య, అంజి, మామిడి వెంకన్న పాల్గొన్నారు.

# రేపు ఎంపీ వద్దిరాజు అభినందన సభ

**బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలిరావాలి**

**ఎమ్మెల్సీ తాతా మధు, సండ్ర, లింగాల పిలుపు**



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్

ఖమ్మం, మార్చి 5 : ఖమ్మం నగరానికి చెందిన రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రకు రెండోసారి సైతం రాజ్యసభకు అవకాశం కల్పించడం పట్ల బీఆర్ఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలో ఈ నెల 7వ తేదీ సాయంత్రం 4 గంటలకు జరిగే మాజీ సీఎం కేసీఆర్ కృతజ్ఞత సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని తెలంగాణభవన్‌లో శీలంశెట్టి వీరభద్రం అధ్యక్షతన జరిగిన బీసీ ముఖ్యనాయకుల సమావేశం, తర్వాత నగర మేయర్ పునుకొల్లు నీరజ అధ్యక్షతన జరిగిన కార్పొరేటర్లు, ఇతర ముఖ్యనాయకులు, పార్టీ మండల అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులతో జరిగిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజుతో కలిసి తాతా మధు మాట్లాడారు. బీసీ నాయకులకు ఉన్నత పదవులు అందించిన ఏకైక వ్యక్తి మాజీ సీఎం కేసీఆర్ మాత్రమేనని అన్నారు. ఎన్నికల్లో పార్టీ ఓటమి చెందినప్పటికీ నాయకులు, కార్యకర్తలు ఆత్మధైర్యాన్ని కోల్పోవద్దని, పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఈ సభకు పెద్ద ఎత్తున బీసీ నాయకులు, కార్యకర్తలు, బీఆర్ఎస్ శ్రేణులు తరలిరావాలని కోరారు. సమావేశంలో జిల్లా బీసీ ముఖ్య నాయకులు, వివిధ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మిర్చి మార్కెట్‌లో దోపిడీని అరికట్టండి..

- ఖమ్మంలో మంత్రి తుమ్మల క్యాంప్ కార్యాలయం ముట్టడి
- సీపీఐ(ఎంఎల్ ) న్యూడెమోక్రసీ, అఖిలభారత రైతుకూలీ సంఘం జిల్లా కమిటీల డిమాండ్



ఖమ్మంలో ప్రదర్శన నిర్వహిస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

ఖమ్మం/ఖమ్మం కమాన్‌బజార్, మార్చి 5 : నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో గల మిర్చి యార్డులో మధ్యదళారీల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మంలోని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంప్ కార్యాలయాన్ని మంగళవారం ముట్టడించారు. ఈ సందర్భంగా అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పంట ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించి స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, తూకాల్లో మోసాలు లేకుండా చూడాలన్నారు. కాగా.. ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు డేవిడ్‌కుమార్, మందుల రాజేంద్రప్రసాద్, బద్దూరి వెంకట్రామిరెడ్డి, వై.ప్రకాశ్, ప్రజల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగ, జిల్లా కార్యదర్శి వై.జానకి, జిల్లా నాయకులు ఐ.వెంకన్న, జి.రమేశ్, న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి పాముల మోహన్‌రావు, ఎస్కే సుబాన్ తదితరులు పాల్గొన్నారు.